## క్లుప్తంగా

### సర్వేపై శిక్షణ



సర్వేపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

సిద్దవటం : కడప డివిజన్ పరిధిలోని జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, వీఆర్‌ఓలు మొత్తం 17 మందికి సర్వేపై శిక్షణ ఇచ్చినట్లు డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వేయర్ దేవేంద్రయ్య, మండల సర్వేయర్ సుధాకర్‌లు తెలిపారు. సిద్దవటంలోని వికాస్ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం సర్వేపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చైన్ సర్వే ఎలా చేయాలి, ఆధునిక పరికరాలైన ఈటీఎస్, రోవర్లతో సర్వే ఎలా చేయాలో శిక్షణ ఇచ్చామన్నారు. అలాగే భూమి మీద కొలతలు తీసి భూమి విస్తీర్ణం ఎలా లెక్కించాలో కూడా శిక్షణలో వివరించినట్లు వారు పేర్కొన్నారు.

### మేల్ శాంతి సమాజం వార్షికోత్సవానికి ఆహ్వానం

నందలూరు (రాజంపేట): శబరిమల, మాలికాపురం మేల్ శాంతుల సమాజం మొదటి వార్షికోత్సవ కార్యక్రమానికి నందలూరు మండల వాసి, అఖిల భారతీయ అయ్యప్ప దర్మ ప్రచార సభ ప్రధాన కార్యదర్శి ఏనుగుల బాలాంజనేయులు (బాలు) గురుస్వామికి ఆహ్వానం అందింది. ఈమేరకు ఆదివారం కేరళలో ఆదిశంకరాచార్యుల జన్మస్థలమైన కాలడిలో మేల్ శాంతి సమాజం వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు బాలాంజనేయులు తెలిపారు.

### తెగుళ్లు, పురుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిద్దవటం : రైతులు తెగుళ్లు, పురుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. బొగ్గిడివారిపల్లె రైతు భరోసా కేంద్రం పరిధిలో నేకనాపురం గ్రామంలో శనివారం టి. సుబ్బారెడ్డి వరి పొలాన్ని సిద్దవటం మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డితో కలిసి సందర్శించారు. రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

### బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



చాణక్య కుటుంబానికి చెక్కును అందిస్తున్న ముక్కా సాయివికాస్ రెడ్డి

ఓబులవారిపల్లె : మంగంపేట పంచాయతీ, అగ్రహారం గ్రామానికి చెందిన చాణక్య అనే బాలుడు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాడు. శనివారం ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా ముక్కా సాయివికాస్‌రెడ్డి బాలుడికి రూ. 30 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరవ శ్రీధర్, సీనియర్ నాయకులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి, వెంకటేష్, నాగరాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో పోటీతత్వం అవసరం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట : విద్యార్థుల్లో పోటీతత్వం అవసరమని ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పాగంగిరెడ్డి అన్నారు. శనివారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ వార్షికోత్సవాలలో భాగంగా నిర్వహించిన వివిధ రకాల పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పోటీ వాతావరణం తట్టుకోవాలంటే విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో నైపుణ్యం సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత పాల్గొన్నారు.

### ఆధార్, రేషన్‌కార్డులు మంజూరు చేస్తాం



యనాది కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ తదితరులు

పెనగలూరు : నల్లపరెడ్డిపల్లి పంచాయతీలోని ముండ్లవారిపల్లి సమీపంలో ఉన్న యనాది కాలనీని ఎంపీడీఓ వరప్రసాద్, సర్పంచ్ హరి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాకు శ్రీనివాస రెడ్డిలు సందర్శించారు. ఈ సందర్భంగా యానాదులు అధికారులతో మాట్లాడుతూ తాము కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే గుడిసెలు వేసుకొని జీవిస్తున్నామని, తమకు ఆధార్, రేషన్ కార్డులు లేవని తెలిపారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ సచివాలయం వద్దకు వస్తే ఆధార్ కార్డులు చేయిస్తామని, తరువాత రేషన్ కార్డుకు దరఖాస్తు చేయిస్తామన్నారు.

# రాజంపేట పట్టణాభివృద్ధికి పకడ్బందీ చర్యలు

- రూ.26కోట్ల ప్రత్యేక నిధులతో ప్రణాళిక
- రోడ్లు, డ్రైనేజీ, తాగునీటిపై ప్రత్యేక దృష్టి
- మున్సిపల్ అధికారులతో సమీక్షలో మేడా, ఆకేపాటి, పోలా



రాజంపేట పట్టణంలోని అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మేడా, ఆకేపాటి, పోలా

రాజంపేట : రాజంపేట పట్టణాభివృద్ధికి పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డిలు అన్నారు. శనివారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన పట్టణాభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో 13 సచివాలయాలు ఉన్నాయన్నారు. ఒక్కో సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు రూ.2కోట్ల నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. 13 సచివాలయాలకు కలిపి రూ.26కోట్ల ప్రత్యేక నిధులు తీసుకువస్తామన్నారు. రాజంపేట పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన దిశగా నిధుల కేటాయింపు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ పట్టణలో మెరుగైన పారిశుధ్యం దిశగా డ్రైనేజీ వ్యవస్థను పటిష్టపరుస్తామన్నారు. ఇందుకు పురపాలకసంఘం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారన్నారు. వార్డు సచివాలయాల పరిధిలో ఎక్కడెక్కడ రోడ్లు అవసరమో గుర్తించే ప్రక్రియ జరుగుతోందన్నారు. అలాగే తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యేక నిధులతో సరిచేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే, జెడ్పీచైర్మన్, మున్సిపల్ చైర్మన్‌ల సూచన మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి అందచనాలు రూపొందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో మేనేజర్ శేషఫణి, ఏఈలు శిల్పా, మల్లేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం**

రాజంపేట : నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళుతున్నానని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం రాజంపేట బైపాస్‌లోని మేడాభవన్‌లో ప్రజలతో సమావేశమయ్యారు. పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వీలైనంత వరకు వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే దిశగా ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాలకు సమాన స్థాయిలో అభివృద్ధి జరుగుతోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. కార్యక్రమంలో అన్ని మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి
- ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమీక్ష

రాజంపేట : ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. రాజంపేటలోని మేడాభవన్‌లో ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీడబ్ల్యూ స్కీం ద్వారా తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. చింతరాజుపల్లె సీపీడబ్ల్యూ స్కీం ద్వారా తాగునీటి సరఫరా పరిశీలన పూర్తయిందన్నారు. సిద్ధవటం మండలంలోని మాధవరంలో నీటి సమస్యకు చెక్ పెట్టే విధంగా ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ రాంగోపాల్‌రెడ్డి, డీఈఈ విద్య, ఏఈ వెంకటేశ్, ఏపీఎస్పీడీసీఎల్ డీఈఈ మురళీధర్‌రెడ్డి, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు జానకిరామయ్య, ఎం.బాలాజీ, రామలక్షుమ్మ, శివనారాయణ, చేవూరి సుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, సునీల్, లక్ష్మీనరసయ్య, పీడబ్ల్యుఎస్ స్కీం కాంట్రాక్టర్ జ్యోతి సుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, సిద్దవటం, ఒంటిమిట్ట ఎస్పీడీసీఎల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులు భవిష్యత్తుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి మహమ్మద్ ఫాతిమా

రాయచోటి: విద్యార్థులు ర్యాగింగ్, చెడు వ్యసనాలకు దూరమై మంచి భవిష్యత్తుపై దృష్టి సారించాలని రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఫాతిమా పేర్కొన్నారు. శనివారం రాయచోటిలోని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ కనబరిచి వివాదాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. సీనియర్లు, జూనియర్ విద్యార్థులు స్నేహం సోదరభావంతో మెలగాలని సూచించారు. శ్రీ సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం .సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలను సోషల్ మీడియా, ప్రింట్ మీడియా ద్వారా ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామాంజనేయులు, అడ్వకేట్ నాగేశ్వరరావు మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.బాలాజీ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్ప



అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి

నందలూరు (రాజంపేట): అన్ని దానాల్లోకల్లా అన్నదానం గొప్పదని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం నందలూరు పంచాయతీలోని పేటగడ్డ, నాగిరెడ్డిపల్లి పంచాయతీలోని గ్రౌండ్ వద్ద, గొల్లపల్లిలోని వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. సర్పంచ్ జంబు సూర్యనారాయణ, వక్ఫ్ బోర్డు జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, సర్పంచ్ సుభాన్, తదితరులు పాల్గొన్నారు.

**పీర్లచావిడి అభివృద్ధికి కృషి చేస్తా**

నందలూరు పంచాయతీలోని సౌమ్యనాథస్వామి ఆలయం వద్ద ఉన్న పీర్లచావిడి అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్ పీర్ల చావిడికి ప్రహరీ, గేటు ఏర్పాటు చేయాలని ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు సమస్యను వివరించి పరిష్కారానికి హామీ పొందారు. నాయకులు నాగ సుబ్బయ్య, కాకిచంద్ర, ఓర్సు శ్రీనివాసులు, అరిగెలనాని, కేదార్‌నాథ్ పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట శ్రీరామక్షేత్రంపై సమగ్ర పరిశోధన చేయాలి

ఒంటిమిట్ట : మరో భద్రాద్రిగా వెలసిన ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి క్షేత్రంపై పౌరాణికంగా, చారిత్రకంగా, శాసన పరంగా సమగ్రమైన పరిశోధన జరగాలని మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే ఒంటిమిట్ట ప్రాంతం, మాండలికాలపై పరిశోధనలు జరగాలన్నారు. శనివారం సాయంత్రం సాహితీవేత్త మామిళ్ల లోకనాథం రచించిన శ్రీరామచంద్ర శతకాన్ని ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలోని రంగమండపంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో శతక వాంగ్మయానికి ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. పోతన జయంతి ఉత్సవాలను ప్రతి ఏటా ప్రభుత్వం నిర్వహించాలని, అలాగే పోతన పేరుతో తపాలా బిళ్ల, ప్రత్యేక కవరు విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోతన సాహితీ పీఠం అధ్యక్షుడు, పసుపులేటి శంకర్, కార్యదర్శి ముమ్మడి నారాయణరెడ్డి, సాహితీ వేత్తలు మోహన్ రెడ్డి, సంజీవయ్య, కె.వి. సుబ్రమణ్యం, చదువుల బాబు, శివశంకర్, పార్వతమ్మ, సంజీవయ్య పాల్గొన్నారు.

### మహాధర్నాను జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : దళితులు, గిరిజనులు, అణగారిన వర్గాలపై ఆధిపత్యకులాలు సాగిస్తున్న దమనకాండను నిలువరించాలన్న డిమాండ్‌తో ఈనెల 29న చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా కోకన్వీనర్ డి.సి.వెంకటయ్య కోరారు. స్థానిక అంబేద్కర్ చిత్రపటం వద్ద శనివారం ఆయన సంఘం నేతలతో కలసి మహాధర్నా పోస్టర్లను విడుదల చేశారు. మతోన్మాదంతో బలహీన వర్గాలపై జరుగుతున్న దాడులను నివారించడంలో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతోందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నారాయణ, చిన్నప్ప, శ్రీకాంత్, కుమార్, చంద్ర, నక్కా నారాయణ పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

చిట్వేలి : సమతుల్య వైవిధ్య భరితమైన సంపూర్ణ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ చిట్వేలి సీడీపీఓ రాజేశ్వరి పేర్కొన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి కొత్తబస్టాండ్ వరకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్ వాడీ వర్కర్లు, పాఠశాల విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా లభించే ఆహారంపై దృష్టి పెట్టడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏబీఎస్ ప్రసాద్, ఐసీడీఎస్ గ్రేడ్-1 సూపర్ వైజర్ సురేఖ రాణి, అంగన్ వాడీ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లంపేట: పుల్లంపేటలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం అంగన్‌వాడీ సూపర్ వైజర్ నిర్మల ఆధ్వర్యంలో పోషకాహారాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోందన్నారు.



పౌష్టికాహారంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# అంతా కలిసొచ్చి..స్వామివారిని ఊరేగించి

రాజంపేట టౌన్ : గణనాథుని నిమజ్జన వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ఆరవ రోజైన శనివారం కొనసాగాయి. నిమజ్జనం సందర్భంగా బొజ్జగణపయ్యను ప్రత్యేక వాహనంలో కొలువుదీర్చి భక్తులు పురవీధుల్లో ఊరేగించారు. దీంతో అన్ని ప్రాంతాల్లో నిమజ్జన వేడుకల సందడి నెలకొంది. భక్తులు దారి పొడవునా బ్యాండు వాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సాగారు. పలు చోట్ల మహిళలు సైతం ఉత్సాహంగా నృత్యాలు చేసి గణపయ్యకు ఘన వీడ్కోలు పలికారు.

**ప్రతి ఇంటి నుంచి కదిలి వచ్చిన భక్తులు**

సరస్వతీపురం వీధిలో గణనాథుని నిమజ్జన వేడుకకు ఆ ప్రాంతంలో ప్రతి ఇంటి నుంచి కదలి వచ్చారు. వినాయక చవితి పండుగ నుంచి విశేష పూజలు నిర్వహించిన ఆ ప్రాంత మహిళలు నిమజ్జన వేడుకకు సైతం కదలి వచ్చి దారి వెంబడి కోలాటం వేస్తూ గణనాథుడిని ఘనంగా సాగనంపారు.

**రూ.1.60 లక్షలు పలికిన లడ్డూ**

పట్టణంలోని నారపురెడ్డిపల్లెలో వినాయకుడి లడ్డూను రూ.1.60 లక్షలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు దేశబోయిన రెడ్డయ్య యాదవ్ దక్కించుకున్నారు. ఆర్డీఓ కార్యాలయం సమీపంలో కసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద ఎద్దలపల్లె శివప్రసాద్‌నాయుడు, చంద్రమోహన్ నాయుడులు రూ.90,116కు లడ్డూను దక్కించుకున్నారు.



రాజంపేట టౌన్: మహిళల కోలాటం మధ్య గణనాథుడి వీడ్కోలు

**రూ.41 వేలు పలికిన సాతపల్లె లడ్డు**

పట్టణంలోని సాతపల్లె లడ్డూ రూ.41,500 పలికింది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సత్యాల రామకృష్ణ రూ.41,500లకు దక్కించుకున్నారు.

**ఉట్టి లాగి.. ఉత్సాహం నింపి**

రాజంపేట రూరల్: జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డివినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొని యువతలో ఉత్సాహం నింపారు. మండలంలోని నారంరాజుపల్లి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని ప్రత్యే పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన లడ్డు వేలంపాటలో అత్యధిక ధరకు లడ్డూను దక్కించుకున్న యువకునికి జెడ్పీ చైర్మన్ లడ్డూను అందజేశారు. అలాగే ఉట్టి కొట్టే కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొని ఉట్టి లాగుతూ యువతలో ఉత్సాహం ఉరకలెత్తించారు.



గాలివీడు:స్వామి వారి లడ్డును దక్కించుకున్న గోపనపల్లె వాటర్‌షెడ్ చైర్మన్ రమణారెడ్డి

**గణపయ్యా..చల్లంగా చూడయ్యా!**

లక్కిరెడ్డిపల్లి : ప్రజలందరూ చల్లగా ఉండేలా కరుణించి కాపాడవయ్యా వినాయకా అంటూ లక్కిరెడ్డిపల్లి, కాకులవరంలలో గణపయ్యలకు స్థానిక ఎంపీపీ సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ గడ్డం కళ్యాణి ప్రభాకర్ రెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు శివశంకర్ రెడ్డి, వీరయ్య, ఎంపీటీసీ శంకర్ నాయుడు, మాజీ సర్పంచ్ దేవేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

**ఘనంగా వినాయకుని నిమజ్జనం**

సిద్దవటం : జంగాలపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక స్వామి విగ్రహానికి శనివారం నిమజ్జనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

**గంగ ఒడిలోకి చేరిన గణనాథులు**

సంబేపల్లి : గణనాథుని నిమజ్జనం కార్యక్రమాన్ని మండలంలో ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం నిర్వహించారు.



రాజంపేట రూరల్:ఉట్టి లాగుతున్న జెడ్పీ చైర్మన్

**78 వినాయక విగ్రహాలు నిమజ్జనం**

పెనగలూరు: మండలంలో శనివారం వరకు 78 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు మండల వ్యాప్తంగా 85 వినాయక విగ్రహాలను గ్రామాలలో ఏర్పాటు చేశారన్నారు.

**రూ.80 వేలు పలికిన వినాయకుడి లడ్డు**

గాలివీడు : మండలంలోని ఎగువగొట్టివీడు గ్రామం గొల్లపల్లెలో వినాయకుడి విగ్రహం వద్ద నిర్వహించిన లడ్డు వేలంపాటలో అదే గ్రామానికి చెందిన తుర్ల వెంకటరమణ రూ.80 వేలకు దక్కించుకున్నారు. పూజారివాండ్లపల్లె వినాయక స్వామి లడ్డును రూ.50 వేలకు గోపనపల్లె వాటర్‌షెడ్ చైర్మన్ నల్లాబత్తుని రమణారెడ్డి దక్కించుకున్నారు.

**రూ. 35 వేలు పలికిన వినాయకుని లడ్డు**

రైల్వేకోడూరు: మండలంలోని వెంకటరెడ్డిపల్లి అరుంధతివాడలో గణపతి లడ్డుకు వేలంపాట నిర్వహించారు. చంటిరవి అనే భక్తుడు రూ.35,100లతో లడ్డును దక్కించుకున్నారు.

## భగవంతుని చేరేందుకు భక్తితత్వమే మూలం



గంగనపల్లి వెంకటరమణను సన్మానిస్తున్న నిర్వాహకులు

రాజంపేట రూరల్ : భగవంతునికి సంబంధించిన మహిమలను వినడం, ఆయనను కీర్తించడం, స్మరించడం, అర్చించడం ద్వారా భక్తులు భగవంతుని చేరేందుకు మార్గం సుగమమవుతుందని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఇసుకపల్లి రోడ్‌లో గల శ్రీనిలయం టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన వినాయకస్వామి మండపంలో శుక్రవారం రాత్రి ఆయన ధార్మికోపన్యాసం చేశారు. విఘ్నాలను తొలగించే దేవునిగా, తొలిపూజ అందుకునే గణపతి అందరికి ఆరాధ్యనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనిలయం టౌన్‌షిప్ నిర్వాహకులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం గంగనపల్లి వెంకటరమణను సత్కరించారు.

## ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం



యూటీఎఫ్ జెండాను ఎగురవేసి మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు ఉపాధ్యాయలోకం సిద్ధం కావాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందూపురం నుంచి విజయవాడకు నిర్వహిస్తున్న ప్రచారయాత్ర శనివారం రాయచోటికి చేరుకుంది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీనపరిచే జాతీయ నూతన విద్యావిధానాన్ని పునఃపరిశీలించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, నాయకులు హరిప్రసాద్, జాబీర్, గంగాదేవి, రమణయ్య, శ్రీధర్‌రెడ్డి, సురేంద్రారెడ్డి, చెంగల్వరాజు, మృత్యుంజయరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి అంజనీ ప్రియదర్శిని

ఓబులవారిపల్లె : చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని రైల్వేకోడూరు జూనియర్ సివిల్ జడ్జి అంజనీ ప్రియదర్శిని పేర్కొన్నారు. శనివారం ఓబులవారిపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్, చిన్నఓరంపాడు పాలకొండ్రాయ డిగ్రీ కళాశాలలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలు, మత్తుపానీయాలకు దూరంగా ఉండాలన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అద్దెపల్లి వెంకటరామరాజు, సీనియర్ న్యాయవాదులు ఎం.శంకరయ్య, ఎం. మూకాంబిక, బీవీ రమణయ్య, ఎం.సురేష్ రెడ్డి, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కె. వేణుగోపాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, పాలకొండ్రాయ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎం .ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు

రాయచోటి అర్బన్ : టీడీపీ నేతలు తాము చేసిన తప్పులను సరిదిద్దుకోకుండా ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్‌చైర్మన్ ఫయాజుర్ రహిమాన్‌లు అన్నారు. శనివారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో వారు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి శాంతికాముకుడు అన్నారు. శ్రీకాంత్‌రెడ్డిని టీడీపీ నేతలు రాజకీయంగా ఎదుర్కోలేక ప్రజలను రెచ్చగొట్టేలా తప్పుడు ప్రచారాలకు దిగుతుండడం దారుణమన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు సుగవాసి ఈశ్వర్, గౌస్‌ఖాన్, ఆసిఫ్‌అలీఖాన్, నాయకులు జానం రవీంద్ర, ఫయాజ్ అహమ్మద్, రియాజ్, శ్యామ్‌కుమార్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## కాలువల నిర్మాణం పనుల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, అధికారులు

రాయచోటి అర్బన్ : రాయచోటి – సుండుపల్లె ప్రధాన మార్గంలో రవి థియేటర్ వద్ద నుంచి ఠాణా వద్దకు, పండ్లమండీల వద్ద నుంచి కొత్తపల్లె వీధులలో డ్రైనేజీ కాలువల నిర్మాణం పనులను మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. శనివారం మధ్యాహ్నం ఆయన వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, మున్సిపల్ ఏఈ వెంకటక్రిష్ణారెడ్డి, డీఈ సుధాకర్, కడపకు చెందిన గ్లోబల్‌క్వాడ్ ప్రైవేట్ ఏజెన్సీ ప్రతినిధి కరీంలతో కలసి కొత్తపల్లె వీధులలో పర్యటించారు. వీధులు జలమయం కాకుండా కాలువలను ఎలా నిర్మించాలనే అంశంపై చర్చించారు.

## బాల్య వివాహాలపై అవగాహన



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సీడీపీఓ సౌభాగ్యమ్మ ఆధ్వర్యంలో విద్యార్థినులకు బాల్య వివాహాలు, పౌష్టికాహారం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల సమాజం కుంటుపడుతుందన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో సరళాదేవి, గుణవతి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

**బాల్య వివాహాలు అరికట్టండి**

పెనగలూరు: మండలంలో బాల్య వివాహాలను అరికట్టాలని తహసీల్దార్ శ్రీధర్ రావు అన్నారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు అనంతరం వీఆర్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో బాల్య వివాహాలు జరగకుండా సచివాలయ సిబ్బందితో కలిసి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

### డీలర్లు డీడీలు కట్టాలి

పెనగలూరు: మండలంలోని డీలర్లు డీడీలు కట్టడంలో ఆలస్యం చేస్తున్నారని, డీడీలను ముందుగానే చెల్లించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ అన్నారు. శనివారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని డీలర్లు, ఎండీవీలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల చివరిలో డీడీలు చెల్లిస్తే సరుకులు సరఫరా చేయడం ఆలస్యమవుతుందని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు.

### పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఓబులవారిపల్లె : పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా రోగాల బారిన పడకుండా ఉండవచ్చని ఎంపీడీఓ విజయారావు అన్నారు. శనివారం పెద్దఓరంపాడు గ్రామంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వాసవీ, పంచాయతీ కార్యదర్శి శివ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పారిశుధ్యం మెరుగుపర్చాలి**

నందలూరు (రాజంపేట): పారిశుధ్యం మెరుగుపర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ స్వచ్ఛత ఈసేవ-2023 ప్రచారంలో భాగంగా నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు.